సాక్షి
హనుమకొండ

శుక్రవారం | 16 | మే | 2025



వనమహోత్సవానికి సిద్ధం
వనమహోత్సవానికి అంతా సిద్ధమైంది. ఈఏడాది రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలు నాటేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. - 9లో▸



సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి - 9లో▸
సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని కాజీపేటఏసీపీ ప్రశాంత్‌రెడ్డి అన్నారు

గరిష్టం/కనిష్టం
37^0 / 27^0

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతీవ్రతతో ఉక్కపోత ఉంటుంది. పలుప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై మోస్తరు వర్షం కురుస్తుంది.

పుష్కరాల ఆరంభ స్నానం చేస్తున్న మాధవానంద సరస్వతిస్వామి, పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు, సరస్వతి నదికి హారతి ఇస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, విప్ ఆది శ్రీనివాస్ తదితరులు







సరస్వతి నమోస్తుతే..



విశేష పూజలతో పుష్కరాలు ప్రారంభం
- తొలిస్నానం ఆచరించిన మాధవానంద సరస్వతిస్వామి
- మొదటిరోజు 50 వేల మంది భక్తుల రాక
- పుష్కరస్నానాలు ఆచరించిన సీఎం రేవంత్, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం
- పదిహేడు అడుగుల ఏకశిల సరస్వతిమాత విగ్రహావిష్కరణ
- కాళేశ్వరానికి సీఎం రేవంత్‌రెడ్డి వరాల జల్లు
- పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు నిధులు

కాళేశ్వరం: సరస్వతి నది పుష్కరాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో గురువారం ఉదయం 5.44 గంటలకు వేద పండితుల మంత్రోచ్ఛరణలతో పూజా కార్యక్రమాలు నిర్వహించి పుష్కరాలను ఆరంభించారు. తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి వేలాదిగా భక్తజనం తరలివచ్చి సరస్వతి ఘాట్‌లోని త్రివేణి సంగమం అంతర్వాహిని సరస్వతి నదిలో పుష్కర స్నానాలు ఆచరించారు. కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో క్యూలైన్లో భక్తులు గంటల తరబడి నిల్చొని స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం వరకు భక్తుల రద్దీ నెలకొంది.

మొదటి రోజు భక్తుల తాకిడి..

తొలిరోజు ఆర్టీసీ బస్సులతోపాటు ప్రైవేట్ వాహనాల్లో వచ్చిన భక్తులు పుష్కర స్నానాలు ఆచరించి ముక్తీశ్వరుడిని దర్శించుకున్నారు. భక్తుల తాకిడితో ఆలయ పరిసరాలు, గోదావరి తీరం కిక్కిరిసింది. పార్కింగ్ స్థలాల్లో వాహనాల రద్దీ నెలకొంది. సుమారు 50వేల మంది భక్తులు పుష్కర స్నానాలు చేసినట్లు అధికారులు అంచనా వేశారు.

హారతి గద్దెలకు ఏడు జీవనదుల పేర్లు

సరస్వతి నది పుష్కరాల సందర్భంగా కాశీ పండితులచే నవరత్నమాల హారతి కార్యక్రమం నిర్వహించడానికి చతుర్వేదసరస్వతి ఘాట్ వద్ద ఏడు గద్దెలు నిర్మించారు. దేవాదాయశాఖ అధికారులు ఆ గద్దెలకు ఏడు జీవనదుల పేర్లను ప్రకటించారు. వాటిలో గంగా, యమున, గోదావరి, సరస్వతి, నర్మద, సింధూ, కావేరి పేర్లను శిలాఫలకం రూపంలో తయారు చేసి ప్రదర్శించారు.

పితృ తర్పనాలు, దంపతి స్నానాలు..

గోదావరికి సైకితలింగాలు చేసి ఆరాధన, గోదావరిలో పితృ తర్పనాలు చేశారు. అదేవిధంగా దంపతి స్నానాలు, పిండప్రదాన పూజలు, నవధాన్యాలు దానాలు, వాయినాలు ఇచ్చిపుచ్చుకోవడం భక్తజనం నిర్వహించారు.

ముఖ్యమంత్రికి వేదాశీర్వచనం

సరస్వతి నది పుష్కరాల ప్రారంభం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి కాళేశ్వరానికి వరాల జల్లు కురిపించారు. సాయంత్రం 4.10 గంటలకు హెలికాప్టర్ ద్వారా కాళేశ్వరం చేరుకున్న సీఎం నేరుగా తాత్కాలికంగా ఏర్పాటు చేసిన టెంట్‌సిటీని పరిశీలించి అక్కడే గంట పాటు విరామం తీసుకున్నారు. అనంతరం సరస్వతి ఘాట్‌కు చేరుకొని అక్కడ ఏర్పాటు చేసిన పదిహేడు అడుగుల ఏకశిల సరస్వతిమాత విగ్రహాన్ని ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. అనంతరం సీఎం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేతో కలిసి అంతర్వాహిని సరస్వతి నదిలో పుష్కర స్నానం ఆచరించారు. అక్కడినుంచి కాళేశ్వర ముక్తీశ్వర ఆలయం చేరుకున్న ఆయనకు అర్చకులు, ఆలయ అధికారులు పూర్ణ కుంభ స్వాగతం పలికారు. అనంతరం గణపతి పూజ చేసి గర్భాలయంలో స్వామివారికి విశేష అభిషేకాలు చేశారు. శ్రీశుభానంద దేవి, సరస్వతి అమ్మవార్లను దర్శించుకున్నారు. అక్కడ సీఎంకు అధికారులు వేదాశీర్వచనం అందజేశారు. అక్కడినుంచి సీఎం, మంత్రులు సరస్వతి ఘాట్‌కు చేరుకున్నారు. చివరగా కాశీ పండితులచే నవరత్నమాలిక హారతి కార్యక్రమాన్ని సీఎం మంత్రులతో కలిసి తిలకించారు. గోదావరి ఆవతలి వైపున బాణసంచా పేల్చి పుష్కర సంబరాన్ని అంబరాన్ని అంటించారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణరావు, ఆది శ్రీనివాస్, కేఆర్ నాగరాజు, భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే, ఉత్సవ కమిటీ సభ్యులు మోహన్ శర్మ, ఈఓ మహేశ్, పలు శాఖల అధికారులు ఉన్నారు.



గురువారం రాత్రి సరస్వతి నదికి నవరత్నమాల హారతి ఇస్తున్న కాశీ పండితులు

కాళేశ్వరం శాశ్వత అభివృద్ధికి తోడ్పాటు : సీఎం రేవంత్‌రెడ్డి



మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

మంత్రి శ్రీధర్‌బాబు కోరినట్లుగా కాళేశ్వరం శాశ్వత అభివృద్ధికి తోడ్పాటును అందిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. మాస్టర్ ప్లాన్ తయారు చేసి నివేదించాలని మంత్రి కొండా సురేఖ, ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్‌ను సీఎం కోరారు. పుష్కర ఏర్పాట్లపై సీఎం సంతృప్తి వ్యక్తం చేసి మంత్రి శ్రీధర్‌బాబును, అధికారులను అభినందించారు.

మంత్రులు ఏమన్నారంటే..

- మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ రాబోయే గోదావరి పుష్కరాల్లోగా కాళేశ్వర అభివృద్ధికి రూ.100 కోట్ల నిధుల మంజూరుతోపాటు పర్యాటక క్షేత్రంగా ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ఇప్పటికే రూ.35కోట్లు మంజూరు చేశారని సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.
- దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధికి సీఎం ఎంతగానో కృషి చేస్తున్నారని చెప్పుకొచ్చారు. రానున్న గోదావరి, కృష్ణ పుష్కరాలతో పాటు సమ్మక్క–సారలమ్మ జాతరను విజయవంతం చేస్తామని అన్నారు.
- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్థిక లోటుపాట్లతో ఉన్నప్పటికి పుష్కర ఏర్పాట్లు ఘనంగా చేశామన్నారు.
- రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ పన్నెండేళ్లకు ఓసారి వచ్చే సరస్వతిమాత పుష్కర స్నానాలను భక్తులు ఆచరించాలని సూచించారు.

- మరిన్ని పుష్కర వార్తలు, ఫొటోలు 8లో▸

ముహూర్తం ప్రకారం 5.44 గంటలకు..
జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో సరస్వతినది పుష్కరాలను వేదపండితులు శాస్త్రోకంగా గణపతిపూజతో ప్రారంభించారు. గురువారం తెల్లవారుజామున 5.44గంటలకు కాళేశ్వరంలోని సరస్వతిఘాటుకు చేరుకొని ముహూర్తం ప్రకారం గోదావరి, ప్రాణహిత, అంతర్వాహిని సరస్వతి నదికి విశేష పూజలు నిర్వహించారు. మెదక్ జిల్లా రంగంపేటకు చెందిన పీఠాధిపతి మాధవానంద సరస్వతిస్వామి ముందుగా పుష్కరునికి ఆహ్వాన పూజ చేశారు. పండితులు సరస్వతిమాతకు పూలు, పండ్లు, పాలు, చీరసారెతో నైవేద్యం సమర్పించారు. మాధవానందసరస్వతిస్వామి పుష్కరినిలో స్నానం ఆచరించి ప్రారంభించారు. అదేవిధంగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఆయన సతీమణి, దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, దేవాదాయ కమిషనర్ వెంకట్‌రావు, కలెక్టర్ రాహుల్‌శర్మ, ఆర్జేసీ రామకృష్ణారావు, ఈఓ మహేశ పుష్కర ప్రారంభ స్నానాలు ఆచరించారు. అనంతరం వేదపండితులు ఐదు కలశాలలో గోదావరి జలాలను తీసుకుచ్చి శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామికి అభిషేక పూజలు చేశారు.



పుష్కర ప్రారంభపూజ చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు దంపతులు



న్యూస్‌రీల్

నిట్‌లో ఇంటర్న్‌షిప్ షురూ



కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లోని సీటీఎల్ (సెంటర్ ఫర్ ట్రైనింగ్ అండ్ లెర్నింగ్) ఆధ్వర్యంలో నెల రోజుల నేషనల్ ఇంటర్న్‌షిప్ గురువారం అట్టహాసంగా ప్రారంభమైంది. అంబేడ్కర్ లెర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో ఏఐఓటీ అండ్ అప్లికేషన్స్ పేరిట ఏర్పాటు చేసిన ఇంటర్న్‌షిప్‌ను డీఆర్‌డీఓ, రీసెర్చ్ సెంటర్ ఇమారత్ సైంటిస్ట్ మల్లికార్జునరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. సాంకేతిక విజ్ఞానంతోపాటు ప్రాక్టికల్ స్కిల్స్ అందించేందుకు ఇంటర్న్‌షిప్ వేదికగా నిలవాలని అన్నారు. భవిష్యత్‌లో ఏఐ దేశ రక్షణలో ముఖ్య భూమిక పోషిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ సైంటిస్ట్ కనికే శ్రీనివాసులు, సీటీఎల్ హెడ్ కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



విద్యారణ్యపురి: ఈనెల 22 నుంచి జరగనున్న ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని హనుమకొండ డీఐఈఓ గోపాల్ కోరారు. జిల్లాలో 33 పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేయగా, 33మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 33మంది డిపార్టుమెంటల్ ఆఫీసర్లను నియమించారు. ఈ మేరకు గురువారం హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో నిర్వహించిన సీఎస్‌లు, డీఓల సమావేశంలో డీఐఈఓ పాల్గొని మాట్లాడారు. ఉదయం ఫస్టియర్, మధ్యాహ్నం సెకండియర్ పరీక్షలు ఉంటాయని తెలిపారు. పరీక్షల నిర్వహణకు పలు సూచనలు చేశారు.

బోధన నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

- ఉపాధ్యాయుల శిక్షణ శిబిరంలో రాష్ట్ర మంత్రి కొండా సురేఖ

ఖిలా వరంగల్: శిక్షణ శిబిరాల ద్వారా ఉపాధ్యాయులు బోధనా నైపుణ్యాలను మరింతగా మెరుగుపర్చుకోవాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సూచించారు. వరంగల్ ఆర్టీఏ జంక్షన్ సమీపంలోని ఓ పాఠశాలలో ప్రభుత్వ జిల్లా పరిషత్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ గురువారం రెండోరోజు కొనసాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ సత్యశారదతో కలిసి మంత్రి కొండా సురేఖ శిబిరాన్ని సందర్శించారు. శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులతో మాట్లాడారు. కార్యక్రమంలో డీఈఓ జ్ఞానేశ్వర్, సుజన్ తేజ, నాగేశ్వర్‌రావు, వెంకటేశ్వర రావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సత్యశారద, తదితరులు

పోస్టర్ ఆవిష్కరణ

న్యూశాయంపేట: మైనార్టీ గురుకులాల్లో ప్రవేశానికి అడ్మిషన్లకు సంబంధించిన పోస్టర్లను వరంగల్ కలెక్టర్ సత్యశారద గురువారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మైనార్టీ గురుకులాల్లో 5వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైనట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎండబ్ల్యూఓ టి.రమేశ్, ఆర్‌ఎల్‌సీ శ్రీనివాస్, ప్రిన్సిపాళ్లు భిక్షపతి, శ్రీపాల, రాజు, కృష్ణకుమారి, నీలిమాదేవి తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీల్లో వ్యర్థాలను తొలగించండి

- అధికారుల సమీక్షలో మేయర్ గుండు సుధారాణి

వరంగల్ అర్బన్: గ్రేటర్ పరిధిలోని 66 డివిజన్లలో ఉన్న 350 ప్రధాన డ్రెయినేజీల్లో వ్యర్థాలను తొలగించాలని మేయర్ గుండు సుధారాణి ఆదేశించారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో ప్రజారోగ్య విభాగం, టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బందితో గురువారం వేర్వేరుగా నిర్వహించిన సమీక్ష సమావేశాల్లో ఆమె మాట్లాడారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా తొలగించిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించాలని కోరారు. అనధికార లేఅవుట్లు గుర్తించాలని, ఎల్ఆర్ఎస్ రుసుం చెల్లించిన దరఖాస్తుదారులకు ప్రొసీడింగ్స్ అందజేయాలని సూచించారు. ఇప్పటివరకు 30,500 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులతో రూ.130.50 కోట్ల ఆదాయం బల్దియాకు సమకూరిందని వివరించారు. ఇన్‌చార్జ్ సిటీప్లానర్ రవీందర్ రాడేకర్, అడిషనల్ కమిషనర్ జోనా, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, డిప్యూటీ కమిషనర్ రవీందర్, ఎంహెచ్ఓ రాజేశ్, ఏసీపీలు రజిత, ఖలీల్, శ్రీనివాస్ రెడ్డి, ఏర్షాద్, శానిటరీ సూపర్‌వైజర్ నరేందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీను పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నగర మేయర్ గుండు సుధారాణి

అమృత్ పనుల పురోగతిపై వర్చువల్ మీటింగ్

అమృత్ పనుల పురోగతి, అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ (యూడీఎఫ్‌ఐ) ప్రతిపాదనలపై పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ టీకే శ్రీదేవి మున్సిపల్ అధికారులు, అర్బన్ ప్లానర్లతో వర్చువల్ మీటింగ్ నిర్వహించారు. బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే పాల్గొన్నారు.

కేయూ పీజీ పరీక్షలు యథాతథం
కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో పీజీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 20 నుంచి యథావిధిగా నిర్వహిస్తామని పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కె.రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి బీఎస్ఎల్ సౌజన్య తెలిపారు. పరీక్షలు వాయిదావేయాలని డిమాండ్ చేస్తూ కొంతమంది విద్యార్థులు గురువారం కాకతీయ యూనివర్సిటీ పరిపాలన భవనం వద్ద ధర్నా నిర్వహించారు. పరీక్షలు వాయిదావేయమని వీసీ కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వి.రామచంద్రం కూడా విద్యార్థులకు తెలిపారు. ముందుగా ప్రకటించిన విధంగా పరీక్షలు జరుగుతాయని పరీక్షల నియంత్రణాధికారి కె.రాజేందర్ తెలిపారు. పూర్తి వివరాలు కేయూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

నలుగురు తహసీల్దార్ల బదిలీ

హన్మకొండ అర్బన్: ప్రభుత్వం భారీగా తహసీల్దార్లకు స్థానచలనం కల్పించింది. అందులో భాగంగా జిల్లాకు ఇతర జిల్లాల నుంచి నలుగురు తహసీల్దార్లు వచ్చారు. ఇక్కడి నుంచి ఒక తహసీల్దార్ ఖమ్మం జిల్లాకు బదిలీ అయ్యారు. హనుమకొండ జిల్లాకు సీహెచ్.రాజు కరీంనగర్ నుంచి, డి.సమ్మయ్య ములుగు నుంచి, జి.రవీందర్‌రెడ్డి సిద్దిపేట నుంచి, రాజేశ్ వరంగల్ నుంచి వచ్చారు. అదేవిధంగా కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న అనంత రామకృష్ణ భద్రాద్రికొత్తగూడెం జిల్లాకు బదిలీ అయ్యారు. సాధారణ ఎన్నికల సమయంలో జిల్లాలు మారిన తహసీల్దార్లు.. ఎన్నికలు ముగిసిన నాటి నుంచి బదిలీల కోసం అర్జీలు పెట్టుకున్నారు. ఎట్టకేలకు ప్రభుత్వం బదిలీ చేసింది. వారు జిల్లాలో రిపోర్ట్ చేయగానే పోస్టింగ్‌లు ఇచ్చే క్రమంలో ప్రస్తుతం పనిచేస్తున్న వారిలో కొందరికి స్థానచలనం కలిగే అవకాశం ఉంది.

వరంగల్ జిల్లాలో..

సాక్షి, వరంగల్: వరంగల్ జిల్లా నర్సంపేట తహసీల్దార్‌గా పనిచేస్తున్న బి.రాజేశ్‌ను హనుమకొండ జిల్లాకు, కరీంనగర్ జిల్లాలోని వీణవంకలో పనిచేస్తున్న డి.మంజులను వరంగల్ జిల్లాకు బదిలీ చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలి



వీరనారాయణపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల వివరాలు అధికారులను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రావీణ్య

- కలెక్టర్ ప్రావీణ్య

ఎల్కతుర్తి: వర్షాకాలానికి ముందే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలని కలెక్టర్ ప్రావీణ్య లబ్ధిదారులకు సూచించారు. మండల కేంద్రంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం, వీరనారాయణపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను గురువారం ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలో మొత్తం 95 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా.. 35 ఇళ్ల పనులు జరుగుతున్నట్లు తెలిపారు. కొంతమంది లబ్ధిదారులకు మొదటి విడత నగదు ఇచ్చామని, ఆర్థిక సమస్యలు ఉన్నవారు సైతం త్వరగా ఇంటి నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. అన్ని గ్రామాల్లో మంత్రి చేతుల మీదుగా పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోళ్లు చివరి దశకు చేరాయని, జిల్లాలో ఇప్పటి వరకు 80వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, రైతులకు రూ.150 కోట్లు చెల్లించినట్లు చెప్పారు. మరో రెండు వారాల్లో మిగిలిన ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు తరలించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్, సివిల్ సప్లయిస్ అధికారి మహేందర్, డీసీఎస్ఓ కొమురయ్య, ఎంపీడీఓ విజయ్‌కుమార్, ఎంపీఓ రవిబాబు, ఏపీఎం రవీందర్ పాల్గొన్నారు.

ఆంగ్ల నైపుణ్యాలు పెంపొందించాలి

హసన్‌పర్తి: విద్యార్థుల్లో ఆంగ్ల నైపుణ్యాలు పెంపొందించాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. భీమారంలోని స్కిల్ స్ట్రోక్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని గురువారం ఆమె సందర్శించారు. శిక్షణ గురించి జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతిని అడిగి తెలుసుకున్నారు. సబ్జెక్టుల వారీగా శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులతో కొంతసేపు ముచ్చటించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అధునాతన బోధనా పద్ధతులు, 21వ శతాబ్దపు శిక్షణతో బోధనలో మెళకువలు పాటించాలని సూచించారు. ప్రభుత్వం బైలింగ్వల్ ద్విభాష పాఠ్యపుస్తకాలు అందిస్తోందని ఆమె వివరించారు. తరగతి గది డిజిటలైజేషన్ కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలని, విద్యార్థుల ప్రవర్తన ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని, నైతిక విలువలపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గుణాత్మక విద్య సమన్వయకులు శ్రీనివాస్, సమ్మిళిత విద్య కోఆర్డినేటర్ సుదర్శన్ రెడ్డి, సెంటర్ ఇన్‌చార్జ్‌లు, రిసోర్స్‌పర్సన్ తదితరులు పాల్గొన్నారు.

సివిల్స్ ప్రిలిమినరీకి ఏర్పాట్లు


విద్యారణ్యపురి: జిల్లాలో ఈనెల 25న నిర్వహించనున్న యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లా పరిధిలో 4,141మంది అభ్యర్థులకు 10 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఉదయం మొదటి సెషన్ 9–30 నుంచి 11–30 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2–30 నుంచి సాయంత్రం 4–30 గంటల వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు అర్ధ గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, అడ్మిట్ కార్డు, పెన్ను, పెన్సిల్ వెంట తెచ్చుకోవాలని సూచించారు. ఆర్టీసీ బస్సులు ఉదయం 7 గంటల నుంచే నడుపుతారని తెలిపారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వైవీ గణేశ్, హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి, డీఈఓ డివాసంతి, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ మధుసూదన్, అధికారులు పాల్గొన్నారు.

నది స్నానం.. పరమ పవిత్రం


నదికి పూజలు చేస్తున్న మహిళలు


శుక్రవారం । 16 । మే । 2025


సరస్వతీనదికి పుష్కర ఆరంభ పూజలు చేస్తున్న మాధవానందసరస్వతీస్వామి




యువతికి బొట్టు పెడుతున్న మహిళ


పుష్కర ప్రారంభ పూజలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు దంపతులు


నదిలో స్నానమాచరించే ముందు మొక్కుతున్న మహిళలు


పూజలు చేస్తున్న పండితులు


నదిలో ప్రమిదను వదులుతున్న మహిళలు


సరస్వతీమాతకు చీరను తీసుకెళ్తున్న వేదపండితులు


పిండ ప్రదాన పూజలు చేస్తున్న భక్తులు


పుష్కర స్నానానికి వస్తున్న భక్తులు

పుష్కర భక్తులకు రోజూ అన్నదానం


మాట్లాడుతున్న మహేశ్ బాబు

వరంగల్ చౌరస్తా : కాళేశ్వరంలో ఈనెల 15 నుంచి 26వ తేదీ వరకు జరుగనున్న సరస్వతీనది పుష్కరాల సందర్భంగా భక్తులకు రోజూ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వాసవి ఆర్యవైశ్య నిత్యాన్నసత్రం ఉపాధ్యక్షుడు గట్టు మహేశ్ బాబు తెలిపారు. గురువారం వరంగల్ రామన్నపేట ఆర్యవైశ్య సత్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 12 రోజుల పాటు కొనసాగే పుష్కరాలకు లక్షలాది మంది ఆర్యవైశ్యులు హాజరై పుష్కర స్నానం చేసి స్వామివారి సేవలో తరిస్తారన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి కుటుంబ సభ్యులతో హాజరయ్యే ఆర్యవైశ్యుల కోసం ఈ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. సమావేశంలో సత్రం అధ్యక్షుడు సోమ రామయ్య, ఉపాధ్యక్షుడు గోరంటల యాదగిరి, ప్రతినిధులు యిరుకుళ్ల రమేశ్, ఐతా గోపినాథ్, గుముడవెల్లి సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆశించిన స్థాయిలో రాని భక్తులు


పార్కింగ్ స్థలంలో తక్కువ సంఖ్యలో ఉన్న వాహనాలు

మల్హర్: సరస్వతీనది పుష్కరాలకు మొదటి రోజు (గురువారం) ఆశించిన మేర భక్తులు రాలేదు. దీంతో కాళేశ్వరం, హనుమాన్ టెంపుల్, మెగా పార్క్ స్థలం వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలాల్లో తక్కువ స్థాయిలో వాహనాలు కనిపించాయి. మొదటి రోజు 125 ఆర్టీసీ బస్సుల ద్వారా 4,664 మంది భక్తులు పుష్కరాలకు వచ్చినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. రెండో రోజు శుక్రవారం కూడా అంతంత మాత్రమే రానున్నట్లు తెలుస్తోంది. శనివారం నుంచి భక్తుల సంఖ్యతో పాటు వాహనాల రద్దీ కూడా పెరిగే అవకాశం ఉంది.

భక్తులకు ఉచిత బస్సు సౌకర్యం



భక్తుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత బస్సు

కాటారం: సరస్వతీనది పుష్కరాల్లో భాగంగా భక్తులకు తాత్కాలిక బస్టాండ్ నుంచి పుష్కర స్నానం ఆచరించే సరస్వతి ఘాట్(వీఐపీ ఘాట్) వరకు సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ బస్సుల ద్వారా భక్తులను చేరవేస్తున్నారు. దీంతో భక్తులకు రవాణా ఇబ్బందులు తొలగడంతో పాటు ప్రయాణ ఖర్చులు ఆదా అవుతున్నాయి. అయితే మొదటి రోజు బస్సులను పుష్కర ఘాట్‌కు కిలోమీటర్ దూరంలో నిలుపడంతో ఎండలో నడవడానికి భక్తులు ఇబ్బందులు పడ్డారు.

ఆర్టీసీ ఏర్పాట్ల పరిశీలన


భూపాలపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్‌తో మాట్లాడుతున్న ఈడీ సోలమన్

భూపాలపల్లి అర్బన్: సరస్వతీనది పుష్కరాల నేపథ్యంలో కాళేశ్వరంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక బస్టాండ్‌ను ఆర్టీసీ కరీంనగర్ ఈడీ సోలమన్, వరంగల్ ఆర్ఎం విజయభాను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన కౌంటర్లు, బస్ పాయింట్లు, భక్తుల సౌకర్యాలను పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా సేవలు అందించాలని డీఎం ఇందుకు ఈ సందర్భంగా సూచించారు.

బస్టాండ్ బహుదూరం..


ఘాట్లకు దూరంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక బస్టాండ్

కాటారం : సరస్వతీనది పుష్కరాల్లో భాగంగా కాళేశ్వరం ఏర్పాటు చేసిన ఆర్టీసీ తాత్కాలిక బస్టాండ్ ప్రధాన ఆలయం, సరస్వతీ(వీఐపీ) ఘాట్, మెయిన్ ఘాట్‌కు చాలా దూరంలో ఉండడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాలు, భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయానికి దగ్గరలోని ఆర్టీసీ బస్టాండ్‌కు అధికారులు బస్సుల రాకపోకలు నిలిపివేశారు. దీంతో తాత్కాలిక బస్టాండ్ నుంచి బస్సులు నడుపుతుండడంతో భక్తులు అక్కడే దిగి అక్కడే ఎక్కాల్సి వస్తోంది. పుష్కర స్నానానికి వెళ్లడానికి ప్రైవేట్ వాహనాల్లో, ఉచిత బస్సుల్లో వెళ్తున్నా తిరుగు ప్రయాణంలో మాత్రం ఆలయం నుంచి తాత్కాలిక బస్టాండ్ వరకు నడుచుకుంటూ రావాల్సి వస్తోంది.

వివిధ స్టాళ్ల ఏర్పాటు..

భూపాలపల్లి: కాళేశ్వర పుష్కర ఘాట్ సమీపంలో, త్రివేణి సంఘం ఒడ్డున పలు జిల్లాలకు చెందిన వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో సుమారు 30 స్టాళ్లు ఏర్పాటు చేశారు. హ్యాండ్లూమ్, తెలంగాణ పిండి వంటలు, కేరళ డ్రైఫ్రూట్స్ హల్వా, చేనేత ఉత్పత్తులతో పాటు పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్, హనుమకొండ జిల్లా కమలాపూర్ చేనేత వస్త్రాలు, నిర్మల్ కొయ్య బొమ్మల స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఇందిరా మహిళ శక్తి ఆధ్వర్యంలో తెలంగాణ పిండి వంటలు కూడా చేసి విక్రయించారు.


నది ఒడ్డున ఏర్పాటు చేసిన స్టాళ్లు

కొడితే.. సిక్స్ కొట్టాలి

భూపాలపల్లి: సరస్వతీ పుష్కరాలకు పిండ ప్రదానం, పుష్కర, శాంతి, నవగ్రహ పూజలు చేసేందుకు ఇతర ప్రాంతాల నుంచి వందలాది మంది పురోహితులు కాళేశ్వరం వచ్చారు. కాగా, విజయవాడ నుంచి వచ్చిన పలువురు పురోహితులు తొలిరోజు పూజలు ముగిశాక సాయంత్రం సరదా క్రికెట్ ఆడారు.


క్రికెట్ ఆడుతున్న పురోహితులు

నవరత్నమాల స్తోత్రంతో తొమ్మిది హారతులు

భూపాలపల్లి: సరస్వతీనది పుష్కరాల్లో భాగంగా తొలిరోజు గురువారం సాయంత్రం త్రివేణి సంగమం వద్ద సరస్వతి నవరత్నమాల స్తోత్రంతో తొమ్మిది హారతులు అందించారు. సర్వ దోష నివారణ కోసం ఓంకార హారతి, సర్పదోషం పోగొట్టి ఆరోగ్యాన్ని ప్రసాదినిచ్చేందుకు నాగహారతి, దీర్ఘాయుష్షుకు పంచ హారతి, రోగాలు మాపి ఆరోగ్యాన్ని ఇచ్చేందుకు సూర్య హారతి, పాడి పంటలు, మానసిక ప్రశాంతత కోసం చంద్ర హారతి, ధర్మ బుద్ధి, శక్తి, విద్య బుద్ధిని ఇచ్చేందుకు నంది హారతి, నాయకత్వం, ధైర్యం ఇచ్చేందుకు సింహ హారతి, సంపదనిచ్చి, కోటి సుఖాలు అందించేందుకు కుంభ హారతి, నిర్మల మనస్సు, కీర్తి కోసం నక్షత్ర హారతి ఇచ్చారు. ఏడుగురు కాశీ పండితులు ఈ హారతులు ఇచ్చారు. దాదాపు అరగంటపాటు జరిగిన ఈ 9 హారతులు ఆహుతులను మైమరపించాయి.

ఆలయ నిర్వహణ అధ్వానం!

- ప్రధాన మండపానికి వెళ్లే గ్రిల్‌కు తాళం వేసిన ఆలయ అధికారులు
- ఇబ్బందులు పడిన భక్తులు

కాళేశ్వరం: కాళేశ్వరంలో సరస్వతీనది పుష్కరాల సందర్భంగా శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయంలో నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. గురువారం అట్టహాసంగా ప్రారంభమైన పుష్కరాలకు తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తెల్లవారుజాము వరకు తరలొచ్చారు. కాగా, నదిలో స్నానాలు చేసిన భక్తులు నేరుగా శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయంలో దేవస్థానం, పోలీసు అధికారులతో ఇబ్బందులు పడ్డారు. పోలీసులు, దేవస్థానం అధికారుల కుటుంబాలు, బంధువులు, స్నేహితుల కోసం దర్శనాలకు వీఐపీ దర్శనాలు చేయించడానికి తీసుకెళ్తున్నారని గుర్తుతెలియని ఎండోమెంట్‌శాఖ అధికారులు ప్రధాన మండపానికి వెళ్లే గ్రిల్‌కు తాళం వేసి దాచిపెట్టారు. దీంతో పోలీసుల, ఇతర అధికారుల కుటుంబాలు రావడంతో దేవస్థాన ఉద్యోగులు తాళం వేసి దొరకడం లేదని తెలుపడంతో ఇబ్బందులు పడ్డారు. దాదాపు రెండున్నర గంటల అనంతరం తాళం చెవి దొరకడంతో సామాన్య భక్తుల దర్శనానికి ఎక్కువ సమయం తీసుకున్నారు. దీంతో అసహనానికి గురయ్యారు.దేవాదాయశాఖ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించారని భక్తులు ఆరోపించారు. మిగతా 11రోజులు ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు భక్తులు కోరుతున్నారు.


పుష్కరాల్లో బాణసంచా వెలుగులు

పోలీసుల అత్యుత్సాహం..

కాళేశ్వరం: సరస్వతీనది పుష్కరాల్లో పోలీసు అత్యుత్సాహం ప్రదర్శించారు. మొదటి రోజు తెల్లవారుజాము నుంచే అధికారులు జారీ చేసిన పాసులతో విధులు నిర్వర్తించే ప్రభుత్వ, ఇతర సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. పోలీసులు.. మీడియా ప్రతినిధులను సైతం అడ్డుకున్నారు. స్థానిక సీఐ మైక్‌సెట్‌లో మీడియాపాస్‌లు చూపిస్తే వదిలేయాలని చెప్పినా విధుల్లో ఉన్న పోలీసులు పట్టించుకోలేదు. అలాగే, సామాన్య భక్తులు కూడా పోలీసుల పనితీరుతో అవస్థలు పడ్డారు. పార్కింగ్‌స్థలు, బస్టాండ్, శ్రీపాదచౌక్ వద్ద లోపలికి వచ్చే సమయంలో స్థానికులను కూడా అనుమతించ లేదు. స్థానికులకు పోలీసులు, రెవెన్యూ, దేవస్థానం వారు పాసులు జారీ చేసి అమలు జరిగేలా చూడాలని పలువురు కోరుతున్నారు.


కాళేశ్వరాయంలో సీఎం రేవంత్‌రెడ్డికి తీర్థం ఇస్తున్న అర్చకుడు, పక్కన మంత్రులు పొంగులేటి, పొన్నం


సరస్వతీమాత విగ్రహం ప్రారంభంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు సురేఖ, శ్రీధర్‌బాబు, పొన్నం, పొంగులేటి తదితరులు


సరస్వతీమాత విగ్రహం


పుష్కర స్నానం చేస్తున్న మహిళలు